ప్రజాశక్తి

సోమవారం 23 జూన్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

పరిహారం ఇవ్వకుండానే పనులు

◆ సొసైటీ భూములను స్వాధీనం చేసుకున్న ఎపిఐఐసి

◆ రాత్రుల్లో సర్వే ◆ మత్స్యకారుల్లో ఆందోళన

సొసైటీ భూముల్లో సాగుతున్న బల్క్ డ్రగ్ పార్కు రహదారి పనులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి విలేకరి

విశాఖ - చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ (విసిఐసి)లో భాగంగా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) మత్స్యకార సొసైటీ భూములకు పరిహారం చెల్లించకుండానే పనులు ప్రారంభించింది. గతంలో అధికారులు ఇచ్చిన మాట నమ్మి చూస్తూ వచ్చిన మత్స్యకారులకు సొసైటీ భూముల పరిహారం జమ కాకపోవడంతో మోసపోయామని అర్థమైంది. ఇప్పుడు వారంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తన నియోజకవర్గంలోని నక్కపల్లి మండలంలో ఎపిఐఐసి సేకరించిన వివిధ రకాల భూములకు పరిహారం చెల్లింపు, పునరావాసం కల్పన, ప్యాకేజీ ప్రకటనలో జరుగుతున్న అన్యాయాన్ని, ఇబ్బందులను రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పరిష్కరించడంలేదన్న అభిప్రాయం పలువురి నుంచి వ్యక్తమవుతోంది. తాజాగా అమలాపురానికి చెందిన మిగతా 2లో..

మాట తప్పారు

సొసైటీ భూములకు పరిహారం చెల్లిస్తామని పలుసార్లు హామీ ఇచ్చారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల మాట నమ్మి భూములు స్వాధీనం చేసుకొని పనులు చేపట్టినా అడ్డు చెప్పలేదు. సమాచారం ఇవ్వకుండా రాత్రిపూట సర్వే చేయడం మమ్మల్ని బాధించింది. మాటలను నమ్మి ఊరుకుంటే పరిహారం వచ్చేలా లేదని ఆందోళన చేపట్టాం. పరిహారం ఇవ్వకపోతే ఆందోళన కొనసాగిస్తాం.

- పారా జోగులు

తూర్పు నావికాదళానికి చేరిన ఐఎన్ఎస్ నీలగిరి

తూర్పు నావికాదళంలోకి నీలగిరి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రాజెక్టు 17 ఎ స్టెల్త్ ఫ్రిగేట్ శ్రేణిలో భాగంగా నిర్మించిన మొదటి నౌక ఐఎన్ఎస్ నీలగిరి తన స్వస్థల నౌకాశ్రయమైన విశాఖకు ఎట్టకేలకు చేరుకుంది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ముంబయిలోని మజాగావ్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్‌లో ఈ నౌక నిర్మాణం 2019 సెప్టెంబర్ 28న ప్రారంభమైంది. పనులన్నీ పూర్తయి ఈ ఏడాది జనవరి 15న భారత నౌకాదళంలోకి ప్రవేశించింది. తాజాగా తూర్పు నౌకాదళంలోకి చేరింది. భారతీయ నౌకాదళ సామర్థ్యాలను గణనీయంగా పెంచడానికి ఈ నౌక తోడ్పడుతుందని, తూర్పు నౌకాదళ కమాండ్‌లో ఈ నౌక ఈస్టర్న్ స్వోర్డ్-సన్‌రైజ్ ఫ్లీట్‌లో కీలక భాగంగా ఉంటుందని అధికారులు తెలిపారు.

ఎన్నో ప్రత్యేకతలు

శత్రు రాడార్‌లకు కనిపించకుండా ఉండే అధునాతన స్టెల్త్ డిజైన్‌తో దీన్ని రూపొందించారు. దీని బరువు 6,670 టన్నులు. పొడవు 149 మీటర్లు. ఇది గంటకు 32 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణించగలదు.

ఎనిమిది దీర్ఘ శ్రేణి బ్రహ్మోస్ యాంటీషిప్ క్షిపణులతోపాటు 32 బరాక్ క్షిపణులు, 8 సర్ఫేస్ టు ఎయిర్ క్షిపణులు కలిగి గాలిలో ఉన్న లక్ష్యాలను సులభంగా ఛేదిస్తుంది. అంతే కాకుండా ఒక హెచ్ఎఎల్ ధ్రు, సీ కింగ్ ఎంకె 42బి హెలికాప్టర్‌ను మోహరించగల సామర్థ్యం కలిగి ఉంది.

బదిలీల్లో న్యాయం కోసం ఉపాధ్యాయుల ఆందోళన

▶ వార్త 4లో..

ఘనంగా మహాకవి శ్రీశ్రీ వర్ధంతి

▶ వార్త 8లో..

మూడు రోజులుగా కదలని చెత్త

▶ వార్త 8లో..

నిరసన తెలుపుతున్న స్థానికులు

మద్యం షాపు వద్దు

39వ వార్డు వాసుల నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజవర్గంలోని 39వ వార్డులో డోర్ నెంబర్ 25-40-5లో కొత్తగా మద్యం షాపు ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం స్థానికులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. పాత లక్ష్మీటాకీస్ ప్రాంతం, శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ సమీపంలో మద్యం షాపు ఏర్పాటు చేయడం వల్ల అనేక ఇబ్బందులు వస్తాయని వారు ఆందోళన చెందారు. ఈ ప్రాంతంలో కొన్ని దేవాలయాలు, పాఠశాల ఉన్నాయని తెలిపారు. జనావాసాల మధ్య దీనిని ఏర్పాటు చేస్తే తాము అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఈ విషయంలో జోక్యం చేసుకొని మద్యం షాపు ఏర్పాటు కాకుండా చూడాలని కోరారు.

వ్యవసాయ సాంకేతికతతో

తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం

'ప్రజాశక్తి'తో ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ఆశాదేవి

ప్రజాశక్తి - అనకాపల్లి

వ్యవసాయ సాంకేతికతతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చునని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) అనకాపల్లి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ఆశాదేవి తెలిపారు. సంస్థ ద్వారా చేపడుతున్న చర్యలను ఆమె 'ప్రజాశక్తి'కి తెలియజేశారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

రైతుల కోసం ఆత్మ సంస్థ ఎటువంటి సహాయక చర్యలు తీసుకుంటోంది ?

రైతుకు లబ్ధి చేకూర్చడమే సంస్థ లక్ష్యం. వ్యవసాయ రంగంలోకి గ్రామీణ యువత రావడం ద్వారా అనూహ్యమైన ఆదాయ మార్గాలు చూస్తున్నారు. ఎప్పటికప్పుడు వస్తున్న సాంకేతికతపై గ్రామీణ యువతకు అవగాహన కల్పిస్తున్నాం. వ్యవసాయ అనుబంధ రంగాల గురించి తెలియజేస్తున్నాం. స్కిల్ ట్రైనింగ్, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో భూసార పరీక్షల పట్ల అవగాహన కల్పించడం చేస్తున్నాం. విశాఖ కృషి విజ్ఞాన కేంద్రం, భాగవతుల ఛారిటబుల్ ట్రస్ట్ కెవికె శాస్త్రవేత్తలు, జిల్లా వనరుల కేంద్రం శాస్త్రవేత్తలతో ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం.

చెరుకు రైతుల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేంటి ?

ప్రధానంగా చెరుకు రైతులను కూలీల కొరత వేధిస్తోంది. చెరుకు ఉత్పత్తి ఖర్చులు కూడా విపరీతంగా పెరిగాయి. ఈ నేపథ్యంలో ఆధునిక వ్యవసాయ సాంకేతికత పట్ల అవగాహన కల్పించి చెరుకులో అధిక ఉత్పత్తి సాధించడంతో పాటు వాల్యూయాడెడ్ ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా రైతులకు అధిక ఆదాయం చేకూరేందుకు కృషి చేస్తున్నాం.

మొదటి పేజీ తరువాయి..

పరిహారం ఇవ్వకుండానే పనులు

మత్స్యకారులు తమ సొసైటీ భూములకు పరిహారం చెల్లించకుండానే స్వాధీనం చేసుకొని బల్క్ డ్రగ్ పార్కు పనులు చేపట్టడంపై ఆందోళన చేపట్టారు.

జిల్లాలోని నక్కపల్లి మండలం వేంపాడు రెవెన్యూ సర్వే నెంబరు 410/4, 417, 418లోని అమలాపురానికి చెందిన కనకమహలక్ష్మి మత్స్యకార సొసైటీకి 43.15 ఎకరాల భూమిని 1994లో ప్రభుత్వం కేటాయించింది. సొసైటీలో 470 మంది సభ్యులుండగా 1200 మంది 43.15 ఎకరాల్లో చేపల చెరువు, కొబ్బరి తోట, వరి సాగుచేసుకొని బతుకుతున్నారు. చేపల వేటతో రోజుకు రూ.200 నుంచి రూ.300 వరకు ఆదాయం వచ్చేదని మత్స్యకారులు తెలిపారు. సొసైటీకి చెందిన ఉప్పుటేరు నీటిని బల్క్ డ్రగ్ పార్క్ పనులకు ఉపయోగించడంతో చెరువు పూర్తిగా ఎండిపోవడంతో మత్స్యకారుల ఉపాధి పోయింది. కొబ్బరి తోటలు నరికి ఎపిఐఐసి రహదారి పనులు ప్రారంభించింది. సొసైటీ భూమి 43.15 ఎకరాలు స్వాధీనం చేసుకొని పనులు చేపడుతున్న ఎపిఐఐసి ఇంతవరకూ పైసా పరిహారాన్ని కూడా మత్స్యకారులకు చెల్లించలేదు. గతంలో ఎన్ఎఒబి భూ సేకరణలో సొసైటీ భూములకు పరిహారాన్ని మత్స్యకారులకు చెల్లించారు. విసిఐసి భూ సేకరణలో కూడా మత్స్యకార సొసైటీ భూములకు పరిహారం చెల్లిస్తామని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కలెక్టర్ యువరాజ్ సమక్షంలో జరిగిన సమావేశ మినిట్స్‌లో పేర్కొన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల మాటలు నమ్మి పరిహారం వస్తుందని ఇంతవరకూ ఎదురుచూశారు. రహదారి పనులు అడ్డుకోవద్దని, పరిహారం చెల్లిస్తామని అధికారులు చెబితే మత్స్యకారులు అంగీకరించారు. అయితే, ఈ నెల 17న రాత్రి 11 గంటల సమయంలో సొసైటీ భూముల్లో రెవెన్యూ అధికారులు సర్వే చేయడంపై మత్స్యకారులు అభ్యంతరం తెలిపారు. మరుసటి రోజు నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లినా సరైన సమాధానం రాకపోవడంతో నాలుగు రోజుల నుంచి పరిహారం చెల్లించాలని ఆందోళన కొనసాగిస్తున్నారు. మత్స్యకారులకు పరిహారం చెల్లించకుండానే వారి సాగులోని కొబ్బరి చెట్లును నరికి భూములు, చెరువులను చదునుచేసి ఎపిఐఐసి రహదారులను నిర్మిస్తోంది. మత్స్యకారుల సొసైటీ భూములకు ఎకరాకు ఆరు లక్షలా ముప్పై వేలు చొప్పున పరిహారం చెల్లించాలని ఈ ఏడాది ఫిబ్రవరి 20న జిల్లా కలెక్టర్‌కు తహశీల్దార్ నర్సింహమూర్తి పతిపాదనలు పంపారు. కానీ స్వాధీనం చేసుకున్న భూములకు పరిహారం చెల్లించకపోవడంతో అనివార్య పరిస్థితుల్లో మత్స్యకారులు ఆందోళన చేపడుతున్నారు.

ఉపాధి పోయింది

సొసైటీ చెరువులో చేపలు, రొయ్యలు పెంచుకొని, కొబ్బరి తోటలు, వరి సాగుచేసుకొని జీవనం సాగించాం. భూములు తీసుకోవడంతో ఉపాధి పోయింది. చెరువు ఎండిపోవడంతో చేపల వేట లేదు. సొసైటీ భూములకు పరిహారంతో పాటు 18 ఏళ్లు నిండిన మా కుటుంబాలకు ప్యాకేజీ చెల్లించాలి.

– రాకాతి రాజు

గవర్నర్‌ను కలిసిన మళ్ల సురేంద్ర

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర ఆదివారం నోవాటల్ హోటల్‌లో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. యోగాంధ్ర విజయవంతం విషయాన్ని తెలియజేశారు. గవర్నర్‌కు పూల మొక్క అందించి శాలువాతో సత్కరించారు.

నిత్యావసర సరుకులు అందజేస్తున్న వాసుపల్లి

ప్రజల పక్షాన నిలవాలి

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : ఇటీవల దక్షిణ నియోజవర్గంలో వైసిపి పార్టీ పదవులు పొందిన వారు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిత్యం పనిచేయాలని వైసిపి దక్షిణ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పిలుపు ఇచ్చారు. వైసిపి 35వ వార్డు అధ్యక్షుడిగా నియమితులైన అలుపున కనక రెడ్డి దంపతులను ఆదివారం మాజీ ఎమ్మెల్యే గణేష్ కుమార్ సత్కరించారు. పార్టీ విశాఖ సౌత్ పబ్లిక్ వింగ్ సెల్ అధ్యక్షులు జీరుసూర్యనారాయణ, (సుధా)వినోద్, దుర్గాప్రసాద్, సిటీ సెక్రెటరీ అబ్బిరెడ్డి ఆది విష్ణు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

38వ వార్డు వైసిపి అధ్యక్షుడు రవికి అభినందనలు

చేపల నూకరాజు ఆధ్వర్యంలో వైసిపి 38వ వార్డు అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన గురజాపు రవి అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ హాజరై గురజాపు రవిని సత్కరించారు. నిత్యావసర సరుకులు, చీరలను వాసుపల్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, వైసిపి సీనియర్ నేత పాటోజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మనిషి ఎదుగుదలలో విద్య కీలకపాత్ర

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : ప్రతి ఒక్కరి జీవితంలో ఎదుగుదలకు విద్య ప్రముఖ పాత్ర పోషిస్తుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ప్రతి ఒక్కరూ పిల్లలను చదివించాలన్నారు. విశాఖ జిల్లా పెరిక కుల సంక్షేమ సంఘం కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ఆదివారం పాత నగరంలో జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, విశాఖ జిల్లా పెరిక సంక్షేమ సంఘం అధ్యక్షులుగా ప్రమాణస్వీకారం చేసిన అక్కిరెడ్డి జగదీష్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిక సంఘం సామాజిక సంఘ భవన నిర్మాణంలో తమ వంతు సహాయ సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పెరిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు జగదీష్, కార్యవర్గ సభ్యులు, కులసంఘం పెద్దలు, సంధ్యారాణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలి

మాట్లాడుతున్న కేశన శంకరరావు

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : దేశంలో అన్ని ఒబిసి సంఘాలు గల్లీ నుండి ఢిల్లీ వరకూ పోరాడి ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, జనగణనతో పాటే సమగ్ర కులగణనను సాధించాయని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు తెలిపారు. ఇకపై జనాభా థామాషా మేరకు చట్టసభల్లో రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఉద్యమిస్తామని తెలిపారు. ఆదివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 27న కులగణన కోసం విజయవాడలో అంతిమ పోరాటంగా వేలాది మందితో నిర్వహించిన ర్యాలీని భగ్నం చేసి, పోలీసులు తన పట్ల ఎంతో పాశవికంగా ప్రవర్తించి, అరెస్టు చేశారో, దేశ ప్రజలందరూ కళ్ళారా చూశారన్నారు. అయినా సరే అదే రోజు కార్లు, మోటారు సైకిళ్ళతో ర్యాలీగా కళాక్షేత్రం వరకు వెళ్లి,మహాత్మా జ్యోతిరావుపూలే, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించామన్నారు. మే 30న కేంద్ర మంత్రిమండలి కులగణనకు ఆమోదం తెలిపిందన్నారు. ఆపై షెడ్యూల్ ప్రకటించడం, జూన్16వ గెజిట్‌లో ముద్రించడం చకచకా జరిగిపోయాయన్నారు. ఒబిసిల కులగణనకు, రిజర్వేషన్లకు ఆర్ఎస్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అయినప్పటికీ కులగణనకు ఆమోదం రావడం హర్షణీయమన్నారు.ఒబిసిల సాధికారిత కోసం కులగణన ప్రక్రియను వేగవంతం చేశారని తాము భావిస్తున్నామన్నారు. జనాభా థామాషా మేరకు ఒబిసిలకు చట్టసభల్లో రిజర్వేషన్లు ఇవ్వాలనే నినాదంతో దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధపడుతున్నామన్నారు. బిసిలకిచ్చిన ఎన్నికల వాగ్దానం మేరకు 33 శాతం రిజర్వేషన్ చట్టపభల్లో కల్పించేందుకు, అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపి చేతులు దులుపుకోవడం కాదని, పార్లమెంటులో చట్టం అయ్యేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్ని శ్రీనివాసరావు మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు కూడా రిజర్వేషన్ కల్పించి అందులో ఒబిసి మహిళలకు ఎంత వాటా ఇస్తున్నారో స్పష్టం చేయాలని విజ్ఞప్తి చేశారు. జాతీయస్థాయిలో చట్టసభల్లో మంత్రి స్థాయి పదవులు కల్పించాలని కోరారు. సమావేశంలో బిసి నాయకులు పోలాకి శ్రీనివాసరావు, గొర్లి శ్రీనివాస నాయుడు, కామన వెంకట సుబ్బారావు, ఎం.సుభాష్ చంద్రబోస్,పల్లా రమణ అన్నవీరపు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

తండ్రి చెంతకు తెలంగాణ మహిళ

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : ఆసియా (29) అనే అవివాహిత మహిళను ఏప్రిల్‌లో రైల్వే స్టేషన్‌లో ఎయుటిడి సిబ్బంది రెస్క్యూ చేసి కాపాడారు. సరూర్‌నగర్ జిల్లాలో 'వాడి' అనే గ్రామం నుండి ఇంట్లో చెప్పకుండా ఆమె పారిపోయి వచ్చేసింది. గత రెండేళ్లుగా ఈమె మానసిక వ్యాధితో బాధపడుతోంది. తండ్రి హాస్పిటల్లో చేర్చే ప్రయత్నం చేయడంతో గొడవ పడి, ఇంట్లో సామాన్లు తగలబెట్టి ఎవరితో చెప్పకుండా వచ్చేసింది. ఈమెను జివియంసి టిఎస్ఆర్ షెల్టర్లో ఉంచి శ్రద్ధా మెడిసిన్ వాడించడంతో కోలుకుంది. ఆదివారం ఆసియాను వైజాగ్ నుంచి నేరుగా తీసుకుని వెళ్లి తండ్రి అహ్మద్ హుస్సేన్‌కి క్షేమంగా అప్పగించడం జరిగిందని ఎయుటిడి కార్యదర్శి ప్రగడ వాసు మీడియాకు తెలిపారు.

బిసిల అభివృద్ధికి కూటమి కృషి

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : బిసిల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు రాజు గౌడ్ యాత తెలిపారు. ఆదివారం గ్రీన్‌పార్క్ హోటల్ జంక్షన్‌లో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ కులగణన చేపడుతున్న ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబులకు కృతజ్ఞతలు తెలిపారు. దాదాపు ఆరు నెలలపాటు జరిగే ఈ లెక్కింపులో 34 లక్షల మంది గణకులు, సూపర్‌వైజర్లతో పాటు 1.34 లక్షల మంది సిబ్బంది కూడా పాలుపంచుకోబోతున్నారన్నారు. ఈ సారి జనగణనతో పాటు కులగణన కూడా చేపట్టబోతున్నారన్నారు.

నేడు జివిఎంసిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి – విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో, అన్ని జోనల్ కార్యాలయాల్లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం సోమవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్టు విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ పత్రికా ప్రకటనలో ఆదివారం తెలిపారు. నగరంలో పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, మొక్కల విభాగం, రెవిన్యూ, యుసిడి, ఇంజినీరింగ్ మొదలగు జివిఎంసి విభాగాలకు సంబంధించిన సమస్యలను తెలియజేయవచ్చునని ఆయన తెలిపారు.

ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : జనరల్ ఇన్సూరెన్స్ సంస్థలలో ఒకటైన బజాజ్ అలియాంజ్ రాష్ట్ర ప్రజల నిర్దిష్ట ఆరోగ్య సంరక్షణ అవసరాలను తీర్చడానికి 'మీకోసం' పేరిట హెల్త్ ఇన్సూరెన్స్ ప్రొడక్ట్‌ను ప్రవేశపెట్టినట్టు సంస్థ ఎమ్‌డి డాక్టర్ తపన్ సింఘాల్ తెలిపారు. సిరిపురం విఐపి రోడ్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రజల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ పాలసీని రూపొందించినట్టు తెలిపారు. ఈ పాలసీలో అత్యాధునిక చికిత్సలు కవర్ అవుతాయని, జీవితకాల రెన్యూవల్ అవకాశం ఉందని అన్నారు. సూపర్ క్యూములెట్ బోనస్‌తో 200 శాతం వరకు ఇన్సూరెన్స్ మొత్తాన్ని అందిస్తుందని తెలిపారు. ఒక్కో సంవత్సరం గడిచే కొద్దీ కవరేజ్ విలువ పెరుగుతుందని అన్నారు. వీటితోపాటు నగదు రహిత క్లైమ్‌లను ఎంచుకునే వారికోసం నగదు రహిత డిస్కౌంట్‌లను, ప్రీమియం తగ్గింపు ఆఫర్లను సంస్థ అందిస్తోందన్నారు.

యాక్సిడెంట్ బారిన పడ్డ కుటుంబాలకు ఈ పాలసీ ద్వారా ఆర్థిక భద్రత చేకూరుతుందన్నారు. ఈ పాలసీని తమ సంస్థ బ్రాంచిలు, భాగస్వాములు, ఏజెంట్లు, డిజిటల్ ప్లాట్‌ఫారాల ద్వారా సులభంగా తీసుకోవచ్చునన్నారు.

IN THE HONOURABLE COURT OF THE DISTRICT JUDGE AT VIZIANAGARAM.
O.S.No 2/2020.

Between:
Sri Raj Kumar Agarwala ....Plaintiff.
And:
Sri Kalagarla Rambabu and others.
.....Defendants.

To
THE DEFENDANTS No 10 AND 13

DEFENDANT NO 10 : Sri Hari Singh S/o Rattan Singh, Hindu, aged about 59 Years, Resident of D/No 50-27-17/1, TPT Colony, Seethammadara, Visakhapatnam.

DEFENDANT NO 13 : Sri Mudunuru Sanyasi Raju S/o Suryanarayana Raju, Hindu, aged about 45 Years, resident of Plot No 7, Shiridi Colony, Thotapalem, Vizianagaram.

Please take notice that the above named Plaintiff instituted the above matter against you. Further, along with the said suit, the plaintiff also filed I.A.No 4/2020 for temporary injunction against you. The said suit and the said interim application stands posted to **2nd day of July 2025 at 10.30 A.M.** for your appearance. On that date you to appear in person or through an advocate before the said Honourable Court at 10.30 A.M., failing which the matter will be heard and determined in your absence as exparte as per law.

BODDU SATYANARAYANA,
BODDU KARTHIK,
ADVOCATES, VIZIANAGARAM
Ph: 9492019394.

రైతు బజారుకు తాకిడి

కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న రైతు బజారు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు పరిధి మీ సేవా కేంద్రం వద్ద ఇటీవలే ప్రారంభించిన రైతు బజారుకు క్రమంగా కొనుగోలుదారుల తాకిడి పెరుగుతోంది. ఆదివారం ఉద్యోగులకు శెలవు దినం కావడం ప్రైవేట్ మార్కెట్‌లో అమ్ముతున్న కూరగాయల ధరలతో పోల్చి చూస్తే బాగా తక్కువ ధరకు లభించడం వెరసి ఉదయం 6 గంటల నుంచే కొనుగోలుదారులతో రైతు బజారు కిటకిట లాడింది.

నెల రోజుల్లోనే అమ్మకాల్లో పురోగతి..

రైతు బజారును మే 20వ తేదీన భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ప్రారంభించిన తొలి రోజుల్లో కూరగాయలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడం, రైతు బజారు ఉందన్న సమాచారం ప్రజలకు చేరక పోవడంతో కొనుగోలుదారులు ఇటుగా దృష్టి సారించలేదు. తర్వాత రైతుబజార్‌లో ధరలు అందుబాటులో ఉండడాన్ని గమనించి కొనుగోలుదారులు పెరగడంతో కూరగాయల అమ్మకాల్లో పురోగతి రోజురోజుకూ పెరుగుతోంది.

రైతు బజారులో మొత్తం 31 దుకాణాలు ఉండగా 20 దుకాణాలు వినియోగంలో ఉన్నాయి. ఇందులో ఒకటి వికలాంగులకు, రెండు దుకాణాలు డ్వాక్రా మహిళలకు కేటాయించారు. రెండు దుకాణాల్లో మాత్రమే టమోటా, ఉల్లి పాయలు, బంగాళ దుంపలు మాత్రమే లభిస్తున్నాయి. ఇవి కూడా అర కొరే. డ్వాక్రా మహిళకు కేటాయించే మరో దుకాణంతో పాటు 10 దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. వంకాయలు, టమోటా, అరటి కాయలు, బెండ, దొండ, చిక్కుడు, ఆనప, బొప్పాయి తదితర కూరగాయలు, పళ్ళు అందుబాటులో ఉన్నాయి. ఇవి కూడా పరిమితంగానే ఉన్నాయి. ప్రజల పూర్తి స్థాయి అవసరాలకు అనుగుణంగా అందుబాటులో లేవు. ఎక్కువ కూరగాయలు తెస్తే, అమ్ముడవ్వక మిగిలి పోతే వచ్చే నష్టాన్ని తట్టుకోలేమని, అందుకనే తక్కువ కూరగాయలు తెస్తున్నామని కొందరు కూర గాయల రైతులు చెబుతున్నారు.

ఉదయాన్నే 6.30 నుంచి 8 గంటల లోపు వచ్చే వారికి కావలసినన్ని అవసరానికి తగ్గట్టుగా కూరగాయలు లభిస్తున్నాయి. ఉదయం 10 గంటల తర్వాత రైతు బజారుకు వచ్చే వారికి అవసరమైన కూరగాయలు దొరక్క పోవడం, దొరికినా చాలీ చాలనవిగా ఉండడంతో కొంత నిరాశకు లోనవుతున్నారు.

పని వేళలు పెంచాలి

ప్రస్తుతం రైతు బజారులో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే కూరగాయల అమ్మకాలు జరుగుతున్నాయి. రెండో పూట కూర గాయలు అమ్మకాలు జరగట్లేదు. రెండు పూటలా కూరగాయలు పూర్తి స్థాయిలో అమ్మేలా మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.

జోగ సన్యాసిరావు
సంగివలస,
ఎఎస్ఆర్. కాలనీ
తగరపువలస

సరిపడా కూరగాయలు ఉంచాలి

రైతు బజారులో ఇక్కడి ప్రజల అవసరాలకు తగ్గట్టుగా కూరగాయలు అందుబాటులో ఉంచాలి. తద్వారా ఎక్కువ మందికి ఉపయోగం.

సుభద్ర
వెలంపేట, తగరపువలస

టమోటా విక్రయాలు పెంచాలి

టమోటా ప్రైవేట్ మార్కెట్‌లో కిలో రూ.40కు అమ్ముతున్నారు. రైతు బజారులో కిలో రూ.21కు అమ్ముతున్నారు. దీంతో టమోటా కోసం ఇక్కడకే ఎక్కువ మంది వస్తున్నారు. గంట, గంటన్నరకే టమోటా అమ్మకాలు పూర్తయి పోతున్నాయి. టమోటా కోసం వచ్చే వారు నిరాశతో వెనుతిరిగి వెళ్లిపోతున్నారు.

విజయగౌరి
తగరపువలస

నేరాలు ఘోరాలు

బెల్టు షాపులపై దాడులు

ప్రజాశక్తి -ములగాడ : మల్కాపురం పోలీస్ స్టేషన్ సిఐ గొలగాని అప్పారావు ఆధ్వర్యాన ఆదివారం మల్కాపురం పోలీసులు మూడు బృందాలుగా వెళ్లి బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించారు. మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం అమ్ముతున్న 3 బెల్ట్ షాపులపై దాడి చేసి 25 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేశారు.

పట్టుబడిన మద్యం సీసాలు

వాటర్ ట్యాంక్ పై నుంచి పడి భవన నిర్మాణ కార్మికురాలు మృతి

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాల నాలుగో అంతస్తులో ఉన్న వాటర్ ట్యాంక్‌పై నుంచి శనివారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో ప్రమాద వశాత్తూ జారి కింద పడి భవన నిర్మాణ కార్మికురాలు మృతి చెందింది. సిఐ బి.తిరుమలరావు కథనం ప్రకారం.. విజయనగరం జిల్లా, పాచిపెంట మండలం, గొలుగువలస గ్రామానికి చెందిన తెర్లపు ఆదిలక్ష్మి (38), భర్త శివ సుమారు నాలుగేళ్లుగా రఘు ఇంజినీరింగ్ కళాశాలలో భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. శనివారం రాత్రి పడుకునేందుకు వీరిద్దరు భవనం కింద ఫ్లోర్‌లో ఉన్న గదికి వెళ్లారు. సంబంధిత గదికి తాళం వేసి ఉండడంతో నాలుగో ఫ్లోర్‌కు వెళ్లి చల్ల గాలి కోసం అదే ఫ్లోర్‌కు సంబంధించి వాటర్ ట్యాంక్ పైకి వెళ్లారు. రాత్రి 8 గంటలకు ఆదిలక్ష్మి వాటర్ ట్యాంక్ దిగుతూ ప్రమాద వశాత్తూ కాలు జారి కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సంగివలస ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మృతురాలి కుమారుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎన్.గౌరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రేమించిన యువతితో తగాదా పడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఎంవిపి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన రాధా ఢిల్లేశ్వర్‌రావు (24) మద్దిలపాలెంలోని అలయన్స్ కాలేజీలో మూడో సంవత్సరం హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్నాడు. మొదట్లో మద్దిలపాలెంలోని ప్రైవేటు హాస్టల్‌లో ఉండేవాడు. ఆరోగ్య కారణాల వల్ల తన స్నేహితుడు నీలాచల్ పాండాతో కలిసి మద్దిలపాలెం చైతన్యనగర్‌లో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని ప్రస్తుతం ఉంటున్నాడు. ఈమధ్యనే సిరిపురంలోని వి హోటల్‌లో రెండు నెలలు ట్రైనీగా చేరాడు. ఈ నెల 21వ తేదీ సాయంత్రం తాగిన మత్తులో ప్రేమించిన యువతితో గొడవపడ్డాడు. అనంతరం తన మిత్రుడు బయటికి వెళ్ళిన సమయం చూసి ఇంటిలోని సీలింగ్ ఫ్యాన్‌కు కరెంటు వైరుతో ఉరేసుకుని చనిపోయాడు. ఈ విషయమై అతని తండ్రి రాధాశ్రీను ఆదివారం ఉదయం ఎంవిపి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - అనకాపల్లి రూరల్ : అనకాపల్లి హైవేలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలమరశెట్టి దామోదర్ వీరునాయుడు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రోడ్డుపై వెళ తున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించి, వైద్యసేవలు అందిస్తున్నారు.క్షతగాత్రుని తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు అనకాపల్లి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖరం తెలిపారు.

తాటాకు ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని సిహెచ్. ఎర్రవరం గ్రామంలో మాదల రాముకు చెందిన తాటాకు ఇల్లు ఆదివారం మధ్యాహ్నం అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న రూ.30వేల నగదు, 3 తులాల బంగారం, వెండి వస్తువులు, బట్టలు, బియ్యం, ఇంటి సామాన్లు, ఆధార్ కార్డులు, పట్టాదారు పాసు పుస్తకం మొత్తం పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంతో తీవ్రంగా నష్టపోయినట్లు మాదాల రాము తెలిపారు.

భెల్‌లో సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి -గాజువాక : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా అఖిలపక్ష కార్మిక సంఘాలు పిలుపుమేరకు వచ్చేనెల 9వ తేదీన దేశవ్యాప్తంగా చేపట్టే సమ్మెలో భాగంగా ఆదివారం భెల్ యాజమాన్యానికి కార్మిక సంఘాల నాయకులు సమ్మె నోటీసును అందజేశారు. లేబర్ కోడ్స్ రద్దు, పిఎఫ్ డేట్ ఆఫ్ జాయినింగ్ సరిచేయాలని, హయ్యర్ పెన్షన్, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలుచేయాలని, రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన పది గంటల పని పెంపును రద్దుచేయాలని తదితర డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసును ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో అందజేశారు. ఈ సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో సిఐటియు నాయకులు జిటిపి.ప్రకాష్, పి.శివరాం, బి.కృష్ణమూర్తి, ఐఎన్‌టియుసి నాయకులు సీతమ్మనాయుడు, వారాడ ఆనందరావు, మురళీశ్వరరావు, ఎఐటియుసి నాయకులు పివిఎన్.రాజు, ఎస్.సాహూ, బి.బాబూరావు ఉన్నారు.

పైడిమాంబ మహోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి కేంద్రకారాగారం ఎదురుగా గల రామకృష్ణాపురంలో పైడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గ్రామ అభ్యుదయ సేవాసంఘం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలను ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు కాకర గోవిందు, వంకర బాబూరావు తెలిపారు. మొదటి రోజైన ఆదివారం పంచామృతాలతో అమ్మవారికి భక్తులు అభిషేకం నిర్వహించారు.

వరి నారు మడులు సిద్ధం

ప్రజాశక్తి- పద్మనాభం : ఈ ఏడాది ప్రారంభం కానున్న ఖరీఫ్ పంటకు వరి నారుమడులను రైతులు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో నువ్వు పంట కోతకు సిద్ధంగా ఉంది. ఈ పంట కోత సమయంలోనే వరి నారు మడులను రైతులు ఏర్పాటు చేసుకుంటారు. ఈ మడులు తయారీ, వరి విత్తనాలు వేసిన స్థలాన్ని గుర్తించి ఆ స్థలంలో మెత్తగా దుక్కులు దున్ని నారు మడిని తయారుచేస్తారు. జులై రెండో వారం నుంచి వరి నారు వేయడానికి రైతులు అన్ని ఏర్పాట్లు చేసుకుంటారు. దీనికి ముందుగా రైతులు ఆర్‌బికె కేంద్రాల్లో వచ్చి ఉన్న వివిధ రకాల వరి విత్తనాలను కొనుగోలు చేస్తారు. కొనుగోలు చేసిన బస్తాల్లో కొద్దిపాటి ధాన్యాన్ని తీసి మొలక కట్టే ప్రయత్నం చేస్తారు. ఐదు రోజుల తర్వాత మొలకెత్తిన విత్తనాలను పరిశీలిస్తారు. ఎక్కువ శాతం మొలకల ఉన్నట్లయితే ఆ వరి విత్తనాలను తయారు చేసి ఉన్న ఆకు మడిలో వేస్తారు. అందుకు సిద్ధంగా ప్రస్తుతం రైతులు ఆకుపోయడానికి మడులను తయారు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ అనంతవరం, మద్ది, విశాఖపాలెం, పద్మనాభం, కృష్ణాపురం, పాండ్రంగి గ్రామాల్లో రైతులు ఏర్పాటు చేస్తున్నారు.

వరి నారు పోయడానికి సిద్ధం చేసి ఉన్న ఆకుమడి

జాతరలో అలరించిన నృత్యాలు

నృత్య ప్రదర్శనలిస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి-మధురవాడ : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం జాతరలో ఆదివారం జోష్ డాన్స్ అకాడమీ చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. బుజ్జి బుజ్జి గణపయ్యతో ప్రారంభించి ఏగిరి నందిని, మారకత మని స్లేట్ తరంగం, జాతిశ్వరం, ముకుంద ముకుంద, ప్రాణావాలయం, అరుకు థింసా నృత్యాలకు చిన్నారులు ఆకాంక్ష, మౌనిక, ప్రజ్ఞ, చిన్నారి, రాజి, సంజన, మనవిత, నవ్య నృత్య ప్రదర్శనలిచ్చారు. ఈ కార్యక్రమాన్ని పరిపాలనాధికారి రమేష్ రెడ్డి పర్యవేక్షించారు.

వెలగపూడి జన్మదిన వేడుకల్లో మాట్లాడుతున్న ప్రతాప్‌రుద్ర

ఘనంగా వెలగపూడి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - ఆరిలోవ : తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు జన్మదిన వేడుకలు ఆదివారం పలు వార్డుల్లో ఘనంగా నిర్వహించారు. 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ ఆధ్వర్యాన దీనదయాల్‌పురం వద్ద గల ప్రభుత్వ బాలుర గృహంలో నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కుమారుడు ప్రతాప్ రుద్ర ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్‌ను కట్ చేశారు. బాలురకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పొత్రకండ ధర్మారావు, యల్లమిల్లి సురేష్, మజ్జి రమణి, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

11వ వార్డులో టిడిపి వార్డు అధ్యక్షులు, ఇన్‌ఛార్జిలు ముడడ రాజారావు, రాగతి అచ్చుతరావు ఆధ్వర్యాన ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పేపర్ నాయుడు, ఎం.కృష్ణంరాజు, మూది అప్పారావు, లింగం సత్యనారాయణ, ఆదినారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

జై జవాన్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం

సహాయం అందిస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి- ఆనందపురం: ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి కుటుంబానికి జైజవాన్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందజేసింది. భీమిలి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన కొల్లి వెంకట అప్పారావు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో కోమాలోకి వెళ్లిపోయాడు. మెడికవర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. చికిత్సకు సుమారు రూ.20 లక్షల ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో ఆర్థికంగా వెనుకబడి ఉన్న కుటుంబం ఈ ఖర్చును భరించలేక సామాజిక మాధ్యమాల్లో సహాయం కోరుతూ విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని గమనించిన ఆనందపురం గ్రామానికి చెందిన జై జవాన్ ఫౌండేషన్ సభ్యులు తక్షణమే స్పందించి, సోషల్ మీడియా ద్వారా విరాళాలు సేకరించి రూ.6,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆదివారం సాయంత్రం జై జవాన్ ఫౌండేషన్ బృందం సభ్యులు లక్ష్మీపురం గ్రామానికి వెళ్లి అప్పారావు కుటుంబ సభ్యులకు సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను, సెక్రటరి ముడసల కార్తీక్, మెంబర్ మెరుగు రాము, లక్ష్మీపురం గ్రామ యూత్ సంఘం సొసైటీ సెక్రటరీ కుప్ప రాసయ్య పాల్గొన్నారు. అప్పారావు త్వరగా కోలుకోవాలని గ్రామస్తులు, ఫౌండేషన్ సభ్యులు ఆకాంక్షించారు.

'బాక్సైట్'పై ఆదివాసీల్లో ఆందోళన

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉమ్మడి విశాఖ మన్యంలో బాక్సైట్ తవ్వకాల్లో ఆదివాసి యువతకు ఉపాధి ఎలా కల్పించవచ్చో బాక్సైట్ శుద్ధి జరుగుతున్న ఒడిశా వెళ్లి అధ్యయనం చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించినట్లు పత్రికల్లో వచ్చిన వార్తలు ఆదివాసీల్లో ఆందోళన రేకెత్తించిందని, కూటమి ప్రభుత్వం బాక్సైట్ జోలికి వెళితే ఆదివాసీల్లో మళ్లీ అలజడి తప్పదని విదసం (విస్తృత దళిత సంఘాల ఐక్య వేదిక) రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట రావు పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయంపై ఆయన తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. మన్యంలో చింతపల్లి, అనంతగిరి, అరకు మండలాల్లో బాక్సైట్ తవ్వకాలు, మాకవరపు పాలెంలో అల్యూమినియం తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ఆన్ రాక్ కంపెనీ ఏర్పాటుకు 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అనుమతులతో మన్యంలో ఎగిసిన ఉద్యమం, దానికి మద్దతుగా జరిపిన పాదయాత్రలు, జిఒ 97పై జరిగిన పోరాటాలు, టిడిపి ఎమ్మెల్యేలు సివేరి సోము, కిడారిలను మావోయిస్టులు కాల్చి చంపడం తదితర చేదు అనుభవాలను మర్చిపోకూడదని గుర్తు చేశారు. 2019లో జగన్ ప్రభుత్వం బాక్సైట్ తవ్వకాలను రద్దు చేస్తూ గతంలో టిడిపి ఇచ్చిన 97 జిఒను రద్దు చేసిన విషయాన్ని ప్రజలు గమనిస్తారని తెలిపారు. మళ్లీ బాక్సైట్ జోలికి వస్తే ప్రజామోదం కాదని స్పష్టం చేశారు. ఒడిశాలో బాక్సైట్ తవ్వకాల కారణంగా అక్కడ ప్రజలు అడివిపై సహజ జీవన హక్కు, నివాసాలు, బతుకుతెరువు కోల్పోయి, తాగునీరు రంగుమారి కలుషితమై అనారోగ్యాలకు గురైన చరిత్ర కళ్లముందు ఉండగా మళ్ళీ కూటమి సర్కారు కేంద్రం అడిగిందని బాక్సైట్ జోలికి వెళితే తేనె తుట్టను కదిలించినట్టేనని హెచ్చరించారు.

రమణారావు ఆశయ సాధనకు కృషి

సంస్మరణ సభలో వక్తలు

ప్రజాశక్తి -గాజువాక : సిపిఎం సీనియర్ నాయకులు పివైవి.రమణారావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. స్నేహపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం సాయంత్రం కాలనీలో రమణారావు సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా 72వ వార్డు కార్పొరేటర్ ఎజె స్టాలిన్ హాజరై మాట్లాడుతూ, ఈ కాలనీ అభివృద్ధి కోసం, మౌలిక సదుపాయాల కల్పన కోసం రమణారావు తీవ్ర కృషిచేశారని కొనియాడారు. కమ్యూనిస్టుగా ఉన్న ఆయన పత్రిక ప్రజల దగ్గరికి వెళ్లాలని ఆ పేపర్‌ను వేసేవారని తెలిపారు. ఏ పనినైనా పట్టుదలతో చేసేవారన్నారు. ప్రస్తుత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మోపుతున్నాయని విమర్శించారు. ఆధునిక దేవాలయాలుగా పిలవబడుతున్న పబ్లిక్ రంగ సంస్థలను మోడీ అమ్మడానికి చూస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఆస్తి పన్ను చట్టాన్ని రద్దుచేయాలని కోరారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, రమణారావు మృతి ఆయన కుటుంబానికి, ప్రజాశక్తి పత్రికకు తీరని లోటు అన్నారు. ఆ వయసులో కూడా పేపర్ బాయ్ రాలేదని అపార్ట్‌మెంట్‌కు పేపర్ వేసే పనిలో ఉండగా రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారంటూ కన్నీరు పెట్టుకున్నారు. వర్షంలో కూడా పేపర్ వేసేవారని తెలిపారు. వార్వా నివాస్ సమావేశాల్లో, ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా ఉండేవారని గుర్తుచేశారు. ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు వద్దని చెప్పిన లోకేష్, ఇప్పుడు ప్రతి ఇంటికీ వాటిని పెట్టడానికి వస్తున్నారని, దాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఆదాని కంపెనీకి సంబంధించిన మీటర్లను పెట్టకుండా అడ్డుకోవాలని కోరారు. ఇప్పటికైతే తమ అపార్ట్‌మెంట్లు వాటిని పెట్టకుండా అడ్డుకున్నాయని తెలిపారు. వార్వా నివాస్ నాయకులు పిట్ట నారాయణమూర్తి మాట్లాడుతూ, రమణారావు బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. సామాజిక పరిస్థితులపై అవగాహన కలిగిన వ్యక్తి అన్నారు. పాడేరు లాంటి ప్రాంతాల్లో కూడా క్లాసులు చెప్పేవారని తెలిపారు. మంచి వ్యక్తిని కోల్పోవడం బాధాకరమన్నారు. వార్వా నివాస్ నాయకుడు బిబి.గణేష్ మాట్లాడుతూ, వార్వా నివాస్ ప్రతి పిలుపులో రమణారావు ముందుండేవారన్నారు. వాయిస్ ఆఫ్ గాజువాక ప్రతినిధి త్రినాథ్‌స్వామి అధ్యక్షతన జరిగిన ఈ సంస్మరణ సభలో కె.కిరీటం, రమణారావు భార్య సుభద్రాదేవి, వైసిపి నాయకులు వాసు, అసోసియేషన్ కార్యదర్శి రాజు, ఎన్.రాజేంద్రప్రసాద్, సత్యనారాయణ, సాంబశివరావు పాల్గొన్నారు. సభకు ముందు రమణారావు చిత్రపటానికి పూలమాలవేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

సభలో మాట్లాడుతున్న ప్రజాశక్తి జనరల్ మేనేజర్ వెంకటేశ్వరరావు, వేదికపై కార్పొరేటర్ స్టాలిన్ తదితరులు

పల్లా సింహాచలం సేవలు మరువలేనివి

సంతాప సభలో వక్తలు

పల్లా సింహాచలం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు తదితరులు

ప్రజాశక్తి -గాజువాక : మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం సేవలు మరువలేనివని వక్తలు కొనియాడారు. యాదవ జగ్గరాజుపేట వద్ద ఆదివారం పల్లా సింహాచలం సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, పల్లా సింహాచలం కార్మిక నాయకునిగా ఉంటూ విశాఖ నగరంలో ఉన్న అన్ని కంపెనీల కార్మికుల సమస్యలపై పనిచేశారని తెలిపారు. అలుపెరుగని పోరాట యోధుడిలా పనిచేసేవారని గుర్తుచేశారు. ఆయన సేవలే నేడు పల్లా శ్రీనివాసరావు ఎమ్మెల్యేగా గెలిపించాయని, టిడిపి రాష్ట్ర అధ్యక్షుని చేశాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా పల్లా సింహాచలం సేవలను గుర్తు చేసుకుంటూ నేటి యువత నడుచుకోవాలని కోరారు.

మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, యాదవుల సంక్షేమం కోసం పల్లా సింహాచలం తన సొంత ఆస్తినే వదులుకున్నారని తెలిపారు. టిబి హాస్పిటల్, పోర్టు హాస్పిటల్ స్థలాలను ఆయన వదులుకున్నవేనని గుర్తు చేశారు. కార్మికులకు సంబంధించి ఎలాంటి జటిలమైన సమస్యనైనా సునాయసంగా పరిష్కరించేవారన్నారు. అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, పల్లా సింహాచలం పోరాట యోధుడన్నారు. పేదల పక్షాన అనేక పోరాటాలు చేసిన చరిత్ర ఉందని తెలిపారు. సిఐటియు నాయకులు జె.అయోధ్యరామ్, ఎన్.రామారావు పాల్గొని మాట్లాడారు. ఈ సంతాప సభలో ఎమ్మెల్యేలు గణబాబు, పంచకర్ల రమేష్‌బాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, టిడిపి, వైసిపి ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు, యాదవ సంక్షేమ సంఘం నాయకులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

విజయోత్సవాలను ప్రారంభిస్తున్న ప్రతినిధులు

'నారాయణ'లో విజయోత్సవాలు

ప్రజాశక్తి -మధురవాడ : విశాఖపట్నం నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యాన జెఇఇ అడ్వాన్స్‌డ్ -2025, నీట్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఆదివారం పిఎం పాలెం వి.కన్వెన్షన్ హాల్లో విజయోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారభించారు. ఈ సందర్భంగా నారాయణ గ్రూప్ డైరెక్టర్ రమాదేవి మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు ఉన్నత శిఖరాలకు చేరాలంటే నారాయణ విద్య సంస్థ ఉత్తమైనదని పేర్కొన్నారు. నారాయణ సంస్థ ఏర్పాటు నుంచి సాధించిన విజయాలను వివరించారు. జెఇఇ అడ్వాన్స్‌డ్ ఆలిండియా ఓపెన్ కేటగిరీలో సాధించిన ర్యాంకుల వివరాలను వెల్లడించారు. రాబోయే ఏడాది చేపట్టబోయే అంశాలను వివరించారు. అనంతరం నారాయణ విద్య సంస్థ డైరక్టర్ గంటా రవితేజను సత్కరించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఫిజిక్స్ ఫ్యాకల్టీ డి.హనుమతురావు మాట్లాడుతూ, ఐఐటి, డాక్టర్ సీటు రావాలంటే నారాయణలో చేరాలన్నారు. 2019 నుంచి 2025 వరకు వచ్చిన ర్యాంకులను వివరించారు. నారాయణ గ్రూప్ ప్రతినిధి ప్రమీల మాట్లాడుతూ, ఇటీవల వచ్చిన పోటీ ర్యాంకుల్లో తమ సంస్థకు పోటీలేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం నారాయణ సంస్థలో చదివి ర్యాంకులు సాధించిన విద్యార్థులు తమ అనుభవాలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, నారాయణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

బదిలీల్లో న్యాయం కోసం ఉపాధ్యాయుల ఆందోళన

డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎంటిఎస్ ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ఆరిలోవ : మినిమం టైం స్కేల్ పద్ధతిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను గిరిజన ప్రాంతాలకు బదిలీచేయాలనే నిర్ణయం వెంటనే మానుకోవాలని ఎంటిఎస్ ఉపాధ్యాయులు ఆదివారం డిఇఒ కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. తమకు అందిస్తున్న అతి తక్కువ జీతాలు కుటుంబనిర్వహణకే సరిపోవని ఇప్పుడు గిరిజన ప్రాంతాలకు బదిలీలు చేస్తే రవాణా చార్జీలు అదనపు భారం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల నగరానికి వచ్చిన విద్యాశాఖా మంత్రి లోకేశ్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు వినతి పత్రాలు అందించామని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అధికారుల, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కౌన్సిలింగ్‌ను బహిష్కరిస్తున్నామని జెఎసిగా ఏర్పడి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఉపాధ్యాయులు తెలిపారు. నిరసనలో భాగంగా జివిఎంసి గాంధీవిగ్రహం వద్ద మంగళవారం ఆందోళన చేస్తామని జెఎసి ప్రతినిధులు కేవీ దుర్గాదేవి, డి.జ్యోతి, టి.లింగమూర్తి, రాజు, మూర్తి, పెనగంటి శ్రీనివాసరావు, శిరికి సూర్యనారాయణ తెలిపారు.

- ఏళ్ల తరబడి నిర్వహణ, మరమ్మతుల్లో నిర్లక్ష్యం
- సముద్రం పాలౌతున్న శారదానదీ జలాలు
- పంటకు నీరు అందక ఆయకట్టు రైతుల గగ్గోలు
- తక్షణమే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్

శిథిల గ్రోయిన్లతో సాగునీరు దూరం!

దెబ్బతిన్న తుమ్మపాల గ్రోయిన్

ప్రజాశక్తి-.అనకాపల్లి : నిర్వహణ, మరమ్మతుల లేమితో శారదా నదిపై గ్రోయిన్లు ఏళ్లతరబడి శిథిలావస్థకు చేరుకున్నారు. ఫలితంగా శారదానదీ జలాలు పంటకాలువల ద్వారా పొలాలకు చేరాల్సిందిపోయి, సముద్రం పాలౌతున్నాయి. దీంతో ఆయకట్టు భూములకు సాగునీరు అందక అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రతిపాదనలు చేయడమే తప్ప, ప్రభుత్వం నుంచి అనుమతులు, నిధులు రాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు .ఇటీవల పూడికలు తీసినా పూర్తి ప్రయోజనముండదని, గ్రోయిన్లకు మరమ్మతులు, అవసరమైతే కొన్నింటిని పునర్నిర్మించాలని రరైతులు వేడుకుంటున్నారు.

శారద నదిపై తగరంపూడి, సీతానగరం, తుమ్మపాల, చెర్లోపల్లి, ఎల్లయ్య, నాగులపల్లి, గొడారి, కాశీ మధుం, వెదురుపర్తి, పేరంటాలపాలెం, ఉగ్గిన పాలెం గ్రోయిన్లు ఉన్నాయి. తగరంపూడి గ్రోయిన్(128 మీటర్లు) కింద 576 ఎకరాలు, సీతానగరం గ్రోయిన్(342 మీటర్లు) కింద 721 ఎకరాలు, తుమ్మపాల గ్రోయిన్(610 మీటర్లు) కింద 1676, చెర్లోపల్లి(537 మీటర్లు) 1168, ఎల్లయ్యపాలెం (367 మీటర్లు) 1952, నాగులపల్లి(418 మీటర్లు) 720, గొడారి(240 మీటర్లు) 1626, కాశీ మధుం(427 మీటర్లు) 931, వెదురుపర్తి(165 మీటర్లు) 751, పేరంటాలపాలెం(185 మీటర్లు) గ్రోయిన్ కింద 122, ఉగ్గిన పాలెం(354 మీటర్లు) గ్రోయిన్ కింద 525 ఎకరాల వెరసి 11 గ్రోయిన్లు కింద మొత్తం 10,771 ఎకరాల ఆయకట్టు ఉంది.

గ్రోయిన్ల మరమ్మతుల్లో నిర్లక్ష్యం

శారదా నదిపై నిర్మించిన గ్రోయిన్లు మరమ్మతుల కారణంగా సుమారు 11వేల ఎకరాలు ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు అందలేదు. ఏటా మూడు వేల ఎకరాల్లో పంట నష్టం తప్పడం లేదు. అధిక వర్షాలు కురిసినప్పుడే తప్ప, ఇతరత్రా సందర్భాలు సాగునీటికి ఇబ్బందులవు తున్నాయి. ఏళ్లతరబడి శిథిలమైన గ్రోయన్ల మరమ్మతుల్లో నేతలు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి గ్రోయిన్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలి

-కర్రి అప్పారావు,
ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

సుమారు 41 కిలోమీటర్ల మేర ఈ గ్రోయిన్ల ద్వారా నీరు ప్రవహించి జగన్నాధపురం, తగరంపూడి, సీతానగరం, కొంచంగి, వెంకుపాలెం, తుమ్మపాల, మార్టూరు, బవులువాడ, రేబాక, శంకరం, అనకాపల్లి, తోటాడ, నాగులపల్లి, ఒంపోలు, తిమ్మరాజుపేట, అరబు పాలెం, కసింకోట, వెదురు పర్తి, బయ్యవరం, పేరంటాలపాలెం, జోగారావుపేట, ఉగ్గిన పాలెం, కొత్తపల్లి బుచ్చయ్యపేట గ్రామాలకు చెందిన ఆయకట్టు భూముల్లోని పంటచేలకు సాగునీరు అందాల్సి ఉంది.

పూడుకుపోయిన పంట కాలువలను పరిశీలిస్తున్న రైతు సంఘం నేత

మరమ్మతులు లేక సాగునీరు వృథా

అయితే ప్రధానంగా ఈ గ్రోయిన్ల షటర్స్ పాడవ్వడం, ఆర్ఎస్‌డి ప్యాకింగ్ డ్యామేజీ వంటి మరమ్మతుల కారణంగా పంటకాలువల ద్వారా ఆయకట్టు భూములకు చేరాల్సిన వర్షపునీటితోపాటు శారదానది సాగునీరు సముద్రంలో కలిసిపోతోంది. దీంతో పంటపొలాల్లోని చేలన్నీ సాగునీటికి అల్లాడక తప్పడం లేదు. వీటికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కొన్నేళ్లుగా ఇరిగేషన్ శాఖ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్తున్నా, వాటికి అనుమతులు, నిధులు మంజూరు లేక, రైతులు నష్టపోక తప్పని స్థితి నెలకొంటోంది. గ్రోయిన్ల కిందనున్న పంట కాలువల నిర్వహణ లేమితో కొన్నేళ్లుగా పూడికలు తీయకపోవడంతో పెద్ద ఎత్తున తుప్పలు డొంకలతో నిండి పోయాయి.దీంతో ఆయకట్టుకు సాగునీరు దూరమయ్యే దుస్థితి నెలకొంది.

ఇరిగేషన్ శాఖ ప్రతిపాదనలు బుట్టదాఖలు

శారదానదిపై ఉన్న గ్రోయిన్ల నిర్వహణ, మరమ్మత్తులకు రూ.6.89 కోట్లు, పూర్తిస్థాయిలో శాశ్వతప్రాతిపదిక పునర్నిర్మాణానికి మరో రూ.300 కోట్లతో ఇరిగేషన్ శాఖఅంచనా ప్రతిపాదనలు సిద్ధం చేసి, అనుమతులు, నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదించింది. అయితే అవన్నీ ఏమయ్యాయో తెలియని పరిస్థితి. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.2.27 కోట్లను మంజూరు చేసి, . పంటకాలువల్లో పూడికతీత పనులు ప్రారంభించారు.

ఇప్పటికైనా స్పందించి, చర్యలు చేపట్టాలి

అయితే పూడిత తీత పనుల వల్ల తాత్కాలిక ప్రయోజనమే తప్ప, పెద్దగా ఒరిగిందేమీ ఉండదని ఆయకట్టు రైతులు అంటున్నారు. ఏళ్ల తరబడి నిరాదరణకు గురైన శారదానది గ్రోయన్లు, పంటకాలువలను శాశ్వత ప్రాతిపదికన పునర్నిర్మాణం చేపడితే ఆయకట్టుకు మేలు జరుగుతుందని రైతన్నలు అంటున్నారు. ఆ దిశగా స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతోపాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలని రైతులు వేడుకుంటున్నారు. శారదానదీ జలాలు వృథాగా సముద్రం పాలవ్వకుండా, పంటపొలాలకు మళ్లించే చర్యలకు ప్రాధాన్యతనివ్వాలని కోరుతున్నారు.

యోగా సాధకురాలు చేతనకు ప్రధాని మోడీ ప్రశంసలు

రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి పొందిన అనకాపల్లి బృందంతో మోడీ

ప్రజాశక్తి -అచ్చుతాపురం : విశాఖలో యోగాడే సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన యోగ సాధకురాలు సరగడం చేతన ప్రశంసలు పొందారు. విజయవాడలో జరిగిన యోగ ప్రదర్శనలో రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన అనకాపల్లి బృందంలో చేతన ఒకరుకాగా ఆమె యోగాసనాలు ప్రదర్శించి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రశంస పొందారు. రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతితో ప్రశంసలు పొందిన అనకాపల్లి జిల్లా బృందాన్ని విశాఖ ఆర్‌కె బీచ్‌లో ప్రధానమంత్రి మోడీ ప్రత్యేకంగా కలిసి వారందరిని అభినందించారు. బృంద సభ్యులతో ప్రత్యేకంగా ప్రధానమంత్రి ఫోటో దిగారు. డ్యావెన్సీ ఇంటర్నేషనల్ స్కూల్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న చేతన, ప్రధానమంత్రితో ప్రశంస పొందడంతో ఆమెను తిమ్మరాజుపేట గ్రామస్తులు అభినందించారు.

తెలుగు రైతు మండల అధ్యక్షునిగా శేషు



శేషును సత్కరిస్తున్న మాజీ ఎంపీ పప్పల చలపతిరావు

ప్రజాశక్తి -మునగపాక: తెలుగు రైతు మండల అధ్యక్షులుగా వాడ్రాపల్లి గ్రామానికి చెందిన మళ్ల శేషు నియమితులయ్యారు. ఆదివారం ఎలమంచిలి టిడిపి కార్యాలయంలో మాజీ ఎంపీ పప్పల చలపతిరావును మర్యాదపూర్వకంగా కలిసిన శేషును సత్కరించారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ, మండలంలో పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ పథకాలు ప్రజలకు ముఖ్యంగా రైతులకు అందజేసేందుకు కృషి చేయాలని సూచించారు.కార్యక్రమంలో టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, పార్టీ మండల అధ్యక్షులు పెంటకోట విజయ్, సబి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులపై హర్షం

ఆర్‌అండ్‌బి అధికారులకు వినతిపత్రం ఇస్తున్న రత్నాకర్

ప్రజాశక్తి-అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహం కార్యదర్శి, ఉమ్మడి విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ మాజీఅధ్యక్షులు దాడి రత్నాకర్ చొరవతో బగులవాడ నుండి వెంకన్నపాలెం వరకు రోడ్లు మరమ్మతులు ప్రారంభమయ్యాయి. అధ్వానంగా ఉన్న రోడ్డు పనులు చేపట్టాలని ఆర్‌అండ్‌బి అధికారులకు టిడిపి నేత రత్నాకర్ ఇచ్చిన వినతి పత్రం మేరకు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగాఅనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే గోవింద సత్య నారాయణ, కూటమినేతలకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

పాల సొసైటీ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఆసకపల్లి పంచాయతీ శివారు నక్కవానిపాలెంలోని విశాఖ డెయిరీ పాల ఉత్పత్తలదారుల సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లుగ్రామ సర్పంచ్ కర్రి నర్సింగరావు తెలిపారు. పాల సొసైటీ అధ్యక్షులుగా తమనాల సూరిబాబు, డైరెక్టర్లుగా నక్క తాతారావు, నోట్ల అప్పారావు, రేసుపూడి లక్ష్మణరావు, కర్రి బంగారు నాయుడు,మామిడి ముత్యాల నాయుడు, చిన్ని అప్పారావు, చిన్ని వెంకునాయుడు, కరణం అప్పారావు, వల్లూరి వెంకటరావు ఎన్నికైనటుల తెలిపారు.

నూతన పాలకవర్గాన్ని స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సోదరులు పంచకర్ల వెంకటేశ్వరరావు అభినందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షుడు కర్రి కనకరాజు, సీనియర్ నాయకులు బలిరెడ్డి అప్పారావు, సాలాపు వెంకటేశ్వరరావు, గండి దుర్గాప్రసాద్, బోకం స్వామినాయుడు,ఉప సర్పంచ్ కరణం సురేష్,గ్రామ పెద్దలు కర్రి బంగారనాయుడు, కర్రి కృష్ణ, ఈపు అప్పలరాజు, గవర సింహాచలం నాయుడు, కరణం శ్రీనివాసరావు, కర్రీ బాలరాజు, కర్రి శ్రీను, బలిరెడ్డి రమణ,తమరాన సత్తిబాబు, నున్న గొప్పల రమేష్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న వెంకటేశ్వరరావు

24న పోతురాజుబాబు పండగ

ప్రజాశక్తి- మునగపాక: మండలంలోని పాటిపల్లి, ఉమ్మలాడ గ్రామాలలో ఈనెల 24న జరగనున్న పోతురాజుబాబు పండగ పోస్టరును ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. అచ్యుతాపురంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు మాట్లాడుతూ గ్రామదేవతల పండగలు సంప్రదాయబద్ధంగా నిర్వహించు కోవాలన్నారు. అల్లర్లకు తావు లేకుండా పండగ నిర్వహణపై నిర్వాహకులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోస్టరు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుందరపు, నిర్వాహకులు

అసంపూర్తి మరుగుదొడ్లతో అవస్థలు

• మలమూత్ర విసర్జనకు విద్యార్థులు, ఉపాధ్యాయుల పాట్లు

ప్రజాశక్తి- వడ్డాది : బుచ్చయ్య పేట మండలం వడ్డాది కెజిబి జెడ్పి హైస్కూల్లో మరుగుదొడ్లు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.గత ప్రభుత్వ హయాంలో నాడునేడు నిధులు చేపట్టినా సగంలోనే నిలిపేయడంతో, మల,మూత్ర విసర్జన అవసరాలకు విద్యార్థులు రోడ్డెక్కక తప్పని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో మహిళా టీచర్లు, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు. వడ్డాది జెడ్పి ఉన్నత పాఠశాలలో క్యాంపస్‌కు ఇరువైపులా రెండు మరుగుదొడ్లు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. నాడు నేడు పథకంలో గత ప్రభుత్వం పనులు ప్రారంభించినా, నిధులు చాలడం లేదని అప్పటి కాంట్రాక్టర్ నిర్మాణ పనులను అర్థాంతరంగా నిలిపివేసి చేతులెత్తేశారు. దీంతో ఈ మరుగుదొడ్లు మొండిగోడలతో దిష్టిబొమ్మల్లా కనిపిస్తున్నాయి. నిర్మాణాలు సగంలోనే నిలిచిపోవడంతో . గోడలకు నాచు పట్టి, తుప్పులు పొదులు పేరుకు పోయి, విషకీటకాలు, పాములకు నిలయంగా మారింది. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇంటర్వెల్, భోజన సమయాల్లో మరుగు అవసరాలకు స్కూల్ మెయిన్ గేటు దాటి రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఉంది. భీమునిపట్నం, నర్సీపట్నం రోడ్డు వెంబడి కొంతదూరం వెళ్లి రోడ్డు పక్కనే పనికానిచ్చేయాల్సిన దుస్థితి. ఇక మలవిసర్జనకు బిఎన్ రోడ్డులో పాఠశాల ప్రహరీ అవతల ఉన్న మామిడి తోటలోకి వెళ్లక తప్పని పరిస్థితి. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే బిఎన్‌రోడ్డు వెంబడి ఇలా విద్యార్థులను వదిలేయడం వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని సర్వత్రా ఆందోళన ఉంది. ఇక మహిళా టీచర్లు ప్రస్తుతానికి హాస్టల్ భవనంలోని మరుగుదొడ్లను వాడుకుంటున్నా, హాస్టల్ ప్రారంభమైతే వీరు కూడా రోడ్డెక్కక తప్పని స్థితి ఉంది. విద్యార్థినులూ ఇబ్బందులు పడక తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి, అసంపూర్తి మరుగుదొడ్లను పూర్తి చేసి, విద్యార్థులు ఉపాధ్యాయుల ఇబ్బందులకు చెక్ చెప్పాలని కోరుతున్నారు.

వడ్డాది జెడ్పి హైస్కూల్లో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్డి

బిఎన్ రోడ్డు వెంబడి మూత్ర విసర్జనకు వెళుతున్న విద్యార్థులు

ముగిసిన వేసవి రగ్బీ క్రీడా శిక్షణ

క్రీడాకారులకు బహుమతులు ఇస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం: భోగాపురం క్రీడామైదానంలో నిర్వహించిన వేసవి రగ్బీ శిక్షణ తరగతులు ముగిసాయి. శిక్షణ పూర్తిచేసుకున్న క్రీడాకారులకు మెడిరైజ్, శ్రీ విష్ణు హాస్పిటల్ వైద్యులు డాక్టర్ జగదీష్, డాక్టర్ ఎ.సుధీర్ ఆదివారం బహుమతులు క్రీడా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి చూపాలన్నారు. పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. క్రీడలలో రాణిస్తే మంచి గుర్తింపుతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. వేసవి శిక్షణ శిబిరం నిర్వాహకులు, కోచ్ వెంకట్ మాట్లాడుతూ నెలరోజులపాటు నిర్వహించిన క్రీడా శిక్షణ శిబిరంలో విద్యార్థులకు మెళకువలను నేర్పామన్నారు. క్రీడలకు ప్రతిఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. శిక్షణ శిబిరానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కె. నాయుడు పాల్గొన్నారు.

టిడిపి సంస్థాగత ఎన్నికల అనకాపల్లి మండల పరిశీలకునిగా మిడతాడ

మిడతాడ మహాలక్ష్మినాయుడు

ప్రజాశక్తి-సబ్బవరం : టిడిపి సంస్థాగత ఎన్నికల అనకాపల్లి మండల పరిశీలకునిగా మండలానికి చెందిన సీనియర్ నాయకుడు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మి నాయుడును నియమించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు మిడతాడ మహాలక్ష్మి నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల టిడిపి అధ్యక్షుడిగా ఎనిమిదేళ్ల పని చేసిన అనుభవం తనకు ఉందని, అలాగే టిడిపి ఆవిర్భావం నుండి పార్టీలోనే కొనసాగుతూ సేవలు చేస్తున్నానన్నారు. అంతకాపెల్లి ఉపసర్పంచ్ గాను, సాగునీటి సంఘం అధ్యక్షులుగాను పనిచేసిన అనుభవం ఉందన్నారు. తనపై నమ్మకం ఉంచి పార్టీసంస్థాగత బాధ్యతలు అప్పగించిన అధినేత చంద్రబాబు, ఇతర నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మహాలక్ష్మినాయుడును పార్టీ శ్రేణులు, అభిమానులు అభినందించారు.

'ఆర్థిక లోటులో అంత దుబారా ఎందుకు?'

ప్రజాశక్తి- దేవరాపల్లి : రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెబుతున్న ప్రభుత్వ పాలకులే, రూ. కోట్ల ప్రజాధనాన్ని యోగ డే కోసం ఖర్చు చేయడం వల్ల సరికాదని, దీనివల్ల రాష్ట్ర ప్రజలకు ఉపయోగం ఏంటని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ ఆదివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. యోగాంధ్ర పేరుతో రెండు రోజులు పాటు బస్సు సౌకర్యాలు లేక గ్రామీణ ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. నెలరోజులకు పైగా ప్రజా సమస్యలపై ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లే అధికారులు అందుబాటులో లేక పనులు జరగని పరిస్థితి ఉందన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అవస్థలు పడుతుంటే, ఇదేమి పట్టనట్టు వ్యవహరించిన ప్రభుత్వం ఇలా దుబారా ఖర్చులకు కోట్లు వెచ్చించడం విడ్డూరంగా ఉందన్నారు. యోగా వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని భావిస్తే, అన్ని ప్రభుత్వ పాఠశాలలో దీన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసి, దీనికొక గురువును నియమించే కొందరికి ఉద్యోగా వకాశంతోపాటు ప్రభుత్వం అనుకున్న ఆశయం నెరవేరు తుందని రమణ సూచించారు. యోగా విషయంలో ప్రభుత్వ పనితీరుపై విస్మయం వ్యక్తం చేశారు.

ఘనంగా బండిమాంబ పండగ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని మొగలిపురం గ్రామ ప్రజల ఆరాధ్య దేవత బండిమాంబ పండగ ఆదివారం ఉత్సవ కమిటీ, నిర్వాహకులు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఉదయం నుంచే అమ్మవారికి ధూప, దీప, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెందుర్తి నియోజకవర్గ వైసిపినాయకులు గండి రవికుమార్ , తులసి దంపతులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజల దరిపై ఉండాలని మొక్కుకున్నట్లు తెలిపారు. కార్యక్రమం లో ఉప సర్పంచ్ సిరపరపు వాసు, వార్డు సభ్యులు గురి నాగమణి, వైసిపి నాయకులు యడ్ల నాయుడు, ఎమ్మెల్యే దేముడు, గురి భరత్, తేజ పాల్గొన్నారు.

చౌడువాడ విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభానికి సిద్ధం

నిర్మాణం పూర్తి చేసుకున్న చౌడువాడ విద్యుత్ సబ్‌స్టేషన్

ప్రజాశక్తి-కె కోటపాడు: మండలంలోని చౌడువాడలో విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణం పూర్తిచేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉంది. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, గ్రామ సర్పంచ్ దాడి ఎరుకనాయుడు చొరవతో ఎపిఇపిడిసిఎల్ ఉన్నతాధికారులు రూ.3.70 కోట్లఅంచనాతో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపగా, ప్రభుత్వం ఆమోదించి, ు నిధులు విడుదల చేసింది. దీంతో పనులు ప్రారంభించిన యంత్రాంగం, చకచకా పూర్తిచేసి, సబ్‌స్టేషన్‌ను ప్రారంభానికి సిద్ధం చేసింది. చౌడువాడ పరిసర గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు తరచూ విద్యుత్ వోల్టేజీ హెచ్చుతగ్గులతో తీ ఇబ్బందులకు గురయ్యేవారు. హైవోల్టేజ వచ్చిన సందర్భాల్లో ఇళ్లల్లోని గృహోపకరాలు కాలిపోయి, తీవ్రనష్టం వాటిల్లిన సందర్భాలూ ఉన్నాయి. ఏదైనా కారణంతో విద్యుత్‌కు అంతరాయం కలిగితే రోజుల తరబడి అంధకారంలో ప్రజలు మగ్గాల్సిన పరిస్థితి ఉంది.

2019లో మంజూరైన నిధులు మళ్లింపు

చౌడవాడ ప్రాంత ప్రజల విద్యుత్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని, 2019లోనే అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఇక్కడ విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుకు రెండున్నర కోట్లు మంజూరు చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం దీన్ని విస్మరించింది. రెవెన్యూ అధికారులు కూడా స్థలం సమకూర్చడంలో జాప్యం చేయడంతో, ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు చౌడవాడ ఉపకేంద్రానికి కేటాయించిన నిధులను ఎలమంచిలి తరలించారు.దీంతో గత ప్రభుత్వ హయాంలో దీని ఊసెత్తే వారే లేకుండా పోయారు

మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక పనులు

తిరిగి 2024లో మరలా తెలుగుదేశం ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే బండారు ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించారు. ఈ ఉప కేంద్రానికి నిరంతర విద్యుత్తును అందించే ప్రధాన లైన్లను చోడవరం మండలం వెంకన్నపాలెం నుంచి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. చౌడువాడలో సిద్ధం చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తే చౌడువాడతోపాటు చుట్టుప్రక్కల గుల్లేపల్లి , గరుగుబిల్లి, మల్లంపాలెం, పాచిలవానిపాలెం చోడవరం మండలం రాయపురాజు పేట, శేమునాపల్లి, నరసాపురం తదితర గ్రామాలకు సైతం కోతలు లేకుండా నిరంతరా యంగా విద్యుత్ సరఫరా జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. చౌడువాడలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుపై స్థానికులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు, విద్యుత్ వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రమణను పరామర్శించిన చిక్కాల

రమణను పరామర్శిస్తున్న రామారావు

ప్రజాశక్తి-పాయకరావుపేట : మండలంలోని అరట్లకోట గ్రామ వైసిపి అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు తూము రమణ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొంది, అరట్లకోటలోని తన ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఉమ్మడి విశాఖపట్నం జిల్లా వ్యవసాయ సలహామండలి మాజీ ఛైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు పరామర్శించారు. చిక్కాల వెంట పార్టీ సీనియర్ నాయకులు పాలపర్తి సతీష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని బోయిలకింతాడ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఈ నెల 23న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ విభాగం మండల ఇంజినీరు కె.శంకరరావు ప్రకటనలో తెలిపారు. . ములకలాపల్లి, కొత్తపెంట, ఎం.అలమండ గ్రామాల్లో విద్యుత్ నిర్వహణ, మరమ్మతుల దృష్ట్యా సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ పంపిణీ నిలిపివేయనున్నట్లు తెలిపారు. తాత్కాలిక అసౌకర్యానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - కశింకోట : మండలం తాళ్ల పాలెం పంచాయతీ బంగారయ్య పేటలో అపార్ట్‌మెంట్లలో 15 రోజులుగా తాగునీటి సమస్యను అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు ఉల్లింగల రమేష్ చొరవతో పరిష్కారమైంది. మోటార్ సమస్యతో తాగునీరు రాక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న రమేష్, ఆదివారం అపార్ట్‌మెంట్ల వద్దకు చేరుకుని నివాసితులతో మాట్లాడారు తన సొంత నిధులతో మోటార్ బాగుచేసి నీరు సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రసాద్ ఉన్నారు

పరిహారం కోసం..

నాలుగో రోజూ మత్స్యకారుల నిరసన

మాట్లాడుతున్న సిపిఎం నేత అప్పలరాజు, మత్స్యకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో వేంపాడు రెవెన్యూ అమలాపురంలో శ్రీ కనక మహాలక్ష్మి సాగర మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి లీజుకు ఇచ్చిన 43 ఎకరాల 15 సెంట్లు భూమికి సంబంధించి పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేస్తూ మత్స్యకారులు తలపెట్టిన ఆందోళన ఆదివారం నాటికి నాలుగవ రోజుకు చేరింది. ఆ భూములకు ఎటువంటి పరిహారం చెల్లించకుండా బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటుకు ఆ భూములలో రోడ్లు నిర్మాణం చేపడుతున్నారని, పరిహారం చెల్లించకుండా రోడ్ల నిర్మాణం ఎలా చేపడతారని ప్రశ్నించారు. మత్స్యకారుల చేస్తున్న పోరాటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మద్దతు ప్రకటించి, మత్స్యకారులు చేస్తున్న నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం నేత అప్పలరాజు మాట్లాడుతూ, 1994లో ఆనాటి ప్రభుత్వం 43 ఎకరాల 15 సెంట్లు భూమి శ్రీ కనక మహాలక్ష్మి సాగర మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి లీజుకు ఇవ్వడం జరిగిందని, నాటి నుండి నేటి వరకు మత్స్యకారులు ఆ భూములు సాగు చేసు కుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు కోసం ప్రభుత్వం ఆ భూములను సేకరించడం జరిగిందన్నారు. ఆ భూములకు ఎటువంటి పరిహారం చెల్లించకుండా బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటుకు ఆ భూములలో రోడ్లు నిర్మాణం చేపడుతున్నారని, పరిహారం చెల్లించకుండా రోడ్ల నిర్మాణం ఎలా చేపడతారని ప్రశ్నించారు. పరిహారం చెల్లించాలని మత్స్యకారులు ఇప్పటికే అనేకసార్లు అధికారులకు విజ్ఞప్తి చేశారని, నేటి వరకు పరిహారం చెల్లించకపోవడంతో మత్స్యకారులు ఆందోళనకు గురై, పోరాట బాట పట్టవలసి వచ్చిందని స్పష్టం చేశారు. రాంబిల్లి, ఎస్.రాయవరం మండలాల్లో నిర్మిస్తున్న ఎన్ఎఓబి నిర్మాణం సందర్భంగా మత్స్యకార సొసైటీ భూములకు నష్ట పరిహారం చెల్లించారని, ఇక్కడ ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. అధికారులు వెంటనే స్పందించి ఆ భూములకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటుకు ఉప్పుటేరును మూసి వేయడంతో ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు 2013 భూసేకరణ చట్ట ప్రకారం 18 సంవత్సరాల నిండిన ప్రతి కుటుం బానికి 15 లక్షల రూపాయలు ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని మత్స్యకారులంతా ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మత్స్యకారులు, మత్స్యకార మహిళలు పాల్గొన్నారు.

నిరుపయోగంగా..

సంపద తయారీ కేంద్రాలు

- ఎక్కడి చెత్త అక్కడే తగలబెడుతున్న వైనం

టి.జగ్గంపేట వద్ద ఉన్న సంపద తయారీ కేంద్రం

ప్రజాశక్తి -కోటవురట్ల: చెత్త నుండి సంపద అంటూ దశాబ్ద కాలంగా అధికారులు ఆర్భాటాలు చేస్తున్నారు. కానీ, ఆచరణలోకి వచ్చిన దాఖలాలు ఎక్కడా లేవు. సంపద సృష్టి కేంద్రాలంటూ నిర్మాణాలు చేపడుతున్నారు వాటిలో ఎక్కడా కంపోస్టు ఎరువులు మాత్రం తయారు చేసిన దాఖలాలు లేవు.

మండల వ్యాప్తంగా 25 గ్రామ పంచాయతీలకు గాను దాదాపు 20 గ్రామాల వరకు సంపద సృష్టి కేంద్రాలు నిర్మించారు. వాటి నిర్వహణను గాలికి వదిలేయడంతో కొన్ని గ్రామాలలో వృధాగా దర్శనమిస్తున్నాయి. దీంతో గ్రామ ముఖ ద్వారాల వద్ద చెత్తను తగలబెట్టడంతో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. తగలబెడుతున్న వాటిలో ఎక్కువగా ప్లాస్టిక్ వ్యర్థాలు ఉండడంతో ఆయా ప్రాంతాల్లో వాయు కాలుష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడి చెత్త అక్కడే తగలపెట్టేయడంతో శ్వాస కోస, ఊపిరితిత్తుల వ్యాధులు బారిన పడే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో ప్రధాన రహదారిని అనుకుని పొగ అధికంగా రావడంతో వాహనదారులు రహదారి సక్రమంగా కనిపించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతినిత్యం గ్రామీణ ప్రాంతాల్లో నిత్య కృత్యంగా చెత్తను తగలబెడుతున్నారు. దీంతో, పాఠశాలకు వెళ్లే విద్యార్థులతో పాటు ఆయా ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకు రావాలని మండల వాసులు కోరుతున్నారు.

రోడ్డు పక్కన తగుల బెడుతున్న చెత్త

గుడుపమ్మ ఆలయం కిటకిట

పూజలు చేస్తున్న భక్తులు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో రేబాక గ్రామంలో గుడుపమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. పలు గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు కుటుంబ సభ్యులతో అక్కడే వంట చేసుకుని భోజనాలు చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. పలు గ్రామాల నుంచి భక్తులు తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది.

నినాదాలు చేస్తున్న కార్మికులు

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసన

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్:సమస్యలు పరిష్కారం చాలని మున్సిపాల్టీ ఇంజనీరింగ్ కార్మికులు సబ్ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన ఆదివారం మూడో రోజు చేరుకుంది. తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ కళ్ళకు గంతల కట్టుకొని మోకాళ్ళతో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ నిరసన కొనసాగించారు. అత్యవ సర సిబ్బందికి రూ.29,200, నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ.24,500 చొప్పున జీతాలు చెల్లించాలని డిమాండు చేశారు. పదేళ్ల సర్వీసు పైబడిన వారిని క్రమబద్ధీకరించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు మాకిరెడ్డి అప్పలనాయుడు, మహేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అభినందిస్తున్న గ్రామస్తులు

నాగరాజుకు అభినందనలు

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో కవగుంట గ్రామానికి చెందిన పారుపల్లి నాగరాజు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ గా ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొమ్మాళి కాంతారావు అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వైస్ ప్రెసిడెంట్ నాగరాజును కవగుంట సర్పంచ్ దాసరి సూర్య కుమారి, గ్రామస్తులు అభినందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, తమ గ్రామానికి చెందిన నాగరాజు వైస్ ప్రెసిడెంట్ గా ఎన్నిక కావడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ఇటువంటి పదవులను మరెన్నో చేపట్టాలని కోరారు.

మాట్లాడుతున్న సర్పంచ్ అప్పారావు

వైసిపి గ్రామ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గొలుగొండ:నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకరగణేష్ ఆదేశాల మేరకు గొలుగొండ గ్రామ పంచాయతీలో వైసిపి అనుబంధ విభాగాల కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో పార్టీ పంచాయతీ అధ్యక్షుడిగా సర్పంచ్ కసిపల్లి అప్పారావు(బుజ్జి), ఉపాధ్యక్షుడిగా అనిమిరెడ్డి నాయుడు, ప్రధాన కార్యదర్శిగా గండెం ఈశ్వరరావు, ఈగల అప్పారావు, మజ్జి శ్రీను, కోన లక్ష్మణమూర్తి, పులి దొరబాబు, రాయపురెడ్డి రాజుబాబు, కోరా అచ్చిరాజు, బోయిన శ్రీను, కొసపల్లి కుమార్, నేతల లోవరాజు, సానా రమణ, రైతు విభాగం అధ్యక్షుడిగా పండా సత్తిబాబు, యూత్ అధ్యక్షునిగా కుంత్యం నాగులను ఎన్నుకున్నారు. అదే విధంగా మహిళా విభాగం అధ్యక్షులుగా కుంత్యం సత్యవేణిలను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కె.లక్ష్మీనారాయణ, హరీష, కొల్లాబత్తిన కళ్యాణం, చిట్ల చినసూకరాజు, రాజాన రాజుబాబు, కొసపల్లి వజ్రం, బుంగ రాము, రాయపురెడ్డి కన్నబాబు, పోతురాజు, అప్పారావు పాల్గొన్నారు.

అధిక ధరకు గ్యాస్ విక్రయాలు

-మండిపడుతున్న వినియోగదారులు

ప్రజాశక్తి - కోటవురట్ల : మండలంలో గ్యాస్ వినియోగదారుల నుంచి హెచ్‌పి నిర్వాహకులు సిలిండర్ ధర కంటే ఎక్కువ వసూలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.870 కాగా రూ.900 వసూలు చేస్తున్నారు. మండలంలో అధికంగా హెచ్‌పి గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధిక ధరకు అమ్మకాలు చేపట్టడంతో వినియోగదారులు తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. వాస్తవానికి గ్యాస్ వినియోగదారులకు డోర్ డెలివరీ ఉచితం చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా డోర్ డెలివరీ సమయంలో గ్యాస్ బండను కాటాపై తూచి ఇవ్వాల్సి ఉంటుంది. డెలివరీ వాహనంపై కాటా సైతం లేకపోవడం పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి, పౌర సరఫరాల శాఖ పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత సివిల్ సప్లై అధికారి కుమార్‌ను వివరణ కోరగా నిర్దేశించిన ధర కంటే అధిక ధరకు విక్రయించినట్లయితే చర్యలు తీసుకుంటామన్నారు. అదనంగా ఎవరూ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని, వినియోగదారులు టోల్ ఫ్రీ నెంబర్ 1800 258 7170కు ఫిర్యాదు చేసినట్లయితే డీలర్లకు జరిమానా విధిస్తామని తెలిపారు.



హాజరైన వైద్యులు, సిబ్బంది

200 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్.పురంలో చెక్క వెంకట పద్మావతి కళ్యాణ మండపంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. విశాఖపట్నం ఓమ్ని హాస్పటల్ జనరల్ ఫిజీషియన్ లగుడు నరేష్ ఆధ్వర్యంలో 200 మందికి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న చిన్నారులు

ఘనంగా మహాకవి శ్రీశ్రీ వర్ధంతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహాకవి శ్రీశ్రీ 42వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం శ్రీశ్రీ గేయాలను ఆలపించారు. శ్రీశ్రీ గొప్పతాన్ని తెలిపేలా కవితలు వినిపించారు. పద్యాలు పాడారు. నృత్యాలు చేశారు. హాజరైన శ్రోతలందరి ప్రశంసలు అందుకున్న ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ పి.మణి, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంటి, నాయకులు ఎస్‌వి.రమణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులకు, గాయకులకు, పలువురి శ్రోతలకు ప్రశంసా పత్రాలను నిర్వాహకులు అందజేశారు.

ప్రశంసాపత్రాలతో చిన్నారులు

విభిన్న ప్రతిభావంతులకు విశిష్ట సేవలు

- ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడు సేవలపై పలువురు ప్రశంసలు

ప్రశంసాపత్రాన్ని ఇస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-రావికమతం: విభిన్న ప్రతిభావంత విద్యార్థులకు మండలంలోని మేడివాడ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మినాయుడు అందిస్తున్న సేవలపై పలువురు ఉన్నతాధికారులు, నాయకులు, తల్లి దండ్రులు అభినందిస్తున్నారు. వారిని చేరదీసి విభిన్న ప్రతిభావంత విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను బయటకు తీస్తున్నారు. వారిపట్ల సమాజంలో చులకన భావం తొలగింపునకు ఆయన కృషి చేస్తున్నారు. విభిన్న ప్రతిభావంత విద్యార్థులకు వైద్య సహాయం, సంక్షేమం, ప్రభుత్వ రాయితీలు అందించేందుకు ఎంతగానో కృషి చేస్తున్నారు. వారికి ఆటల పోటీలు నిర్వహించి పోటీ తత్వాన్ని పెంపొందిస్తున్నారు. ఈ విధంగా ఈ విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించడం విశేషం. ప్రభుత్వం కల్పించే ఎస్కార్ట్, ట్రాన్స్ పోర్ట్ అలవెన్సు, స్కాలర్ షిప్స్, ఉచిత ఉపకరణాలు, సదరం సర్టిఫికేట్, ఉచిత బస్ పాస్‌లను వంటి సేవలను వారికి అందిస్తున్నారు. విద్యార్థులకు అందించిన సేవలకు గాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ .శ్రీనివాసరావు, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, జిల్లా అనకాపల్లి జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధికారులు పలు సందర్భాల్లో మహాలక్ష్మినాయుడికి ప్రశంసా పత్రాలుతో పాటు సన్మానాలు చేశారు. విభిన్న ప్రతిభావంత విద్యార్థులకు నిత్యజీవితంలో ఉపయోగపడే డిజిటల్ టెక్నాలజీ గూగుల్ యాప్ ల గురించి రాష్ట్ర కీ రిసోర్స్ పర్సన్ గా రాష్ట్రంలో 26 జిల్లాల్లో ప్రత్యేక ఉపాధ్యాయులకు శిక్షణను మహాలక్ష్మినాయుడు అందించారు. గూగుల్ సంస్థ గుర్తించి గూగుల్ ఫర్ ఎడ్యుకేషన్ ఛాంపియన్ సర్టిఫైడ్ ట్రైనర్ సర్టిఫికెట్ అందించి అభినందించింది.

బోధిస్తున్న మహాలక్ష్మినాయుడు

రోడ్డు సదుపాయం కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండలంలోని ఇరగాయి పంచాయతీ మారుమూల గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించాలని సిపిఎం మండల కమిటీ సభ్యుడు పి.రామన్న డిమాండ్ చేశారు. ఆదివారం మారుమూల గాతపాడు, నంద గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడుతూ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇరగాయి తోటవలస నుండి నంద వరకు రోడ్డు సదుపాయం లేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. తోటవలస, బోరకొండ, సోరుపోదర్, పెద్దగరువు, దోనుగుమి, జరలాంగీ, కారమాన్ వలస, గాతపాడు, నంద గ్రామాలకు రోడ్డు సదుపాయం లేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ గ్రామాల్లో సుమారు 2000 మంది జనాభా జీవనం సాగిస్తున్నారని అన్నారు. ఆరోగ్యం సమస్య వచ్చినప్పుడు ఆస్పత్రికి రావాలంటే అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితి ఉండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. అరకులోయ మండల కేంద్రం నుంచి ఈ గ్రామలకు సుమారు 30 కిలోమీటర్లు ఉందన్నారు. గ్రామాలకు కనీసం రోడ్డు సదుపాయం కల్పించాలనే ఆలోచన అధికారులకు, ప్రజాప్రతినిధులు లేదని మండి పడ్డారు. ఎన్నికలు సమయంలో మాత్రం రాజకీయ నాయకులు ఓట్లు కోసం గ్రామాల్లో వస్తారు తప్ప గెలిచాక వివిధ సమస్యలపై పట్టించుకునే నాధుడే లేడన్నారు.

'యువత పోరు'ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ఈ నెల 23న జరగనున్న యువత పోరులో నియోజక వర్గంలోని యువకులంతా పాల్గొనాలని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ సమస్యలపై ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో గణేష్ మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు నెలకు 3 వేల రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి, నేటి వరకు ఆ ఊసే ఎత్తలేదన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం నియోజకవర్గ యువత అధ్యక్షుడు తమరాన శ్రీను, నర్సీపట్నం నియోజకవర్గం విద్యార్థి విభాగం అధ్యక్షుడు కిల్లడా శ్రీనివాసరావు, నాతవరం యూత్ బండారు పైడినాయుడు, విద్యార్థి విభాగం అధ్యక్షుడు పుణ్యమంతుల స్వామి, గొలుగొండ మండలం యూత్ అధ్యక్షులు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు పాల్గొన్నారు.

ర్యాలీ చేపడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్, నాయకులు

మూడు రోజులుగా కదలని చెత్త

▶▶ బీచ్ రోడ్డు శుభ్రతకు పారిశుధ్య కార్మికుల మళ్లింపు
▶▶ వార్డుల్లో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టని జివిఎంసి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలోని జోన్ - 3 పరిధిలో మూడు రోజులుగా ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉంది. నగరంలోని పారిశుధ్య కార్మికుల్లో ఎక్కువ మందిని యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీచ్ రోడ్డు, ఎయు వంటి ప్రాంతాలకు మళ్లించారు. తీరంలో శుభ్రతకు ఇచ్చిన ప్రాధాన్యతను వార్డులకు ఇవ్వలేదు. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టలేదు. దీంతో గడిచిన మూడు రోజులుగా హెచ్‌బి కాలనీ, సీతమ్మధార, మద్దిలపాలెం ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికే నగర జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులను ప్రభుత్వం నియమించలేదు. ఉన్నవారిపైనే భారం మోపుతోంది. 600 మంది పారిశుధ్య సిబ్బంది అవసరమైన చోట సగం మంది మాత్రమే ఉన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారి స్థానంలోనూ, చనిపోయిన వారి స్థానంలోనూ కొత్త నియామకాలను చేపట్టక పోవడంతో సమస్య నానాటికీ తీవ్రమవుతోంది. మూడు రోజులుగా చెత్తను తీసుకెళ్లకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్టు మద్దిలపాలెంనకు చెందిన గృహిణి కృష్ణవేణి వాపోయారు. ప్రధాని, ముఖ్యమంత్రి వచ్చి, వెళ్లిన మార్గాలను సుందరంగా తీర్చిదిద్దుతూ మిగతా ప్రాంతాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఆమె అన్నారు. ఇలానే చెత్త ఉండిపోతే అంటువ్యాధులు ప్రబలుతాయని సీతమ్మధారకు చెందిన నారాయణరావు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించాలని కోరారు.

జోన్ 3లో పేరుకుపోయిన చెత్త

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు
షష్టిపూర్తి శుభాకాంక్షలు

అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.

మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు

మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.

ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు

మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	9490099125	పూర్ణమార్కెట్	9490099676
మధురవాడ	8008596645	జగదాంబ	9490099434
గాజువాక	9849392359	జివియంసి	9490099483
అనకాపల్లి	8008736188	ద్వారకానగర్	9490099672
చోడవరం	9490099141	కంచరపాలెం	9490099135
నర్సీపట్నం	9440280411	మాదవధార	9490099675
పాడేరు	9490099142		
రంపచోడవరం	9440165617		